## బేరసారాల్లోనూ

లావాదేవీలకూ నూన్–చీ సూత్రాన్ని అన్వయించుకోవచ్చు. ఆ సమయంలో మనం ఎంత నిశ్శబ్దంగా ఉంటే అంత ప్రయోజనం. ఎంత తక్కువ మాట్లాడితే అంత లాభపడతాం. ఇల్లు కొనడానికి వెళ్లినప్పుడు, 'ఎంతమంది పిల్లలు సార్?' అనే ప్రశ్న ఏజెంట్ నోటి నుంచి యథాలాపంగా ఏం రాదు. మీ జవాబును బట్టి 'దగ్గరే మంచి స్కూల్స్ ఉన్నాయి సార్. ట్రాన్స్‌పోర్టేషన్ తలనొప్పే ఉండదు' అని ఊరిస్తాడు. అతని మనసును ముందే గ్రహించి.. మనం ఆ ప్రశ్నను దాటవేయాలి. దళారీ దవాఖానల గురించి చెప్పినా, చీరల దుకాణాల గురించి వర్ణించినా... మిమ్మల్ని ఖరీదైన బేరానికి ఒప్పించడమే లక్ష్యం. అతని వలలో పడకండి. ప్రతి ప్రశ్నకూ 'అవునా..' అని మాత్రమే సమాధానం ఇవ్వమని సలహా ఇస్తారు నూన్–చీ నిపుణులు.





చాలా సందర్భాల్లో మౌనానికి భయపడేవారే లొడలొడా వాగేస్తుంటారు. దీంతో ఒకదాని తర్వాత ఒకటి, ఒకదాని తర్వాత ఒకటి మాట్లాడుతూనే ఉంటారు. వాళ్లను పెద్దగా ప్రోత్సహించకండి. సానుభూతి చూపకండి. ఆ ప్రవాహానికి అడ్డకట్ట వేయండి. ఇక్కడే ఇంకో విషయాన్నీ చర్చించాలి.. పొగడ్త! ప్రతి పొగడ్తనూ స్వీకరించకండి. అందులో కొన్ని మొహమాటాలూ ఉంటాయి. ఏది పొగడ్తో, ఏది మొక్కుబడి ప్రశంసో తెలుసుకోవాలంటే నూన్–చీ తెలిసి ఉండాలి. మిమ్మల్ని ప్రేమించే వారికి మీరు ఏం చేసినా, ఏం రాసినా నచ్చినట్టే అనిపిస్తుంది. దీంతో, కర్ణ కఠోరంగా ఆలపించినా 'బాగా పాడారు' అంటారు. అదంతా నిజమే అనుకుని 'అయితే.. ఇంకో పాట వినిపిస్తాను' అంటూ గొంతెత్తకండి. ఆ అమాయకులు పరుగెత్తేస్తారు. అది ప్రేమతో ఇచ్చిన కితాబా, నైపుణ్యానికి మురిసిపోయి అందించిన ప్రశంసా .. అనేది అర్థం చేసుకోవాలన్నా మనసును చదివే శక్తి ఉండాలి. నూన్–చీతో ఆ పరిపూర్ణత వస్తుంది.

**రకరకాలు..**

నూన్–చీలో అనేక రకాలు. కొన్ని పాజిటివ్ ఎనర్జీని ఇస్తాయి. ఇంకొన్ని నెగెటివ్ ఎనర్జీని నియంత్రిస్తాయి. మరికొన్ని తటస్థంగా మారుస్తాయి. మొత్తంగా మనిషి మూలాల్ని తడిమే కళ ఇది. మానవుడు సంఘజీవి. నూన్–చీ సంఘ కళ. సామాజిక జీవితం అనివార్యం. సంఘాన్ని తప్పించుకోలేం. దాంతో మసలడం ఎలాగో తెలుసుకోవాలి. అప్పుడే నువ్వు సుఖంగా ఉంటావు. సంతోషంగా బతుకుతావు. కొరియన్ జీవనకళ నేర్పేదీ ఇదే. మనిషి ముఖాన్ని చదవగలిగితే సంఘాన్ని, ఆపైన సమాజాన్ని చదవడం పెద్ద కష్టమేం కాదు. పొరుగువాడు, సహోద్యోగి, సహపాఠి, కాలనీ, ఆఫీసు.. ఎవర్నీ దేన్నీ ఎంచుకోం మనం. యాదృచ్ఛికంగా మన జీవితంలో భాగమైపోవడం జరుగుతుందంతే. ఆ మార్పును మనం యథాతథంగా స్వీకరించాలి. ఉన్నది ఉన్నట్టే ఆమోదించాలి. మరో ఆలోచన లేకుండా కలిసి బతకాలి. ఇక్కడ జరిగే ప్రక్రియలు రెండే.. నిశితంగా గమనించడం, హృదయపూర్వకంగా స్వీకరించడం. ఆ ప్రక్రియ ఎంత వేగంగా జరిగితే అంత తొందరగా మనం స్థిరపడతాం, స్థిమితపడతాం. ఆనందంగానూ ఉంటాం. దీనివల్ల మంచి పొరుగువ్యక్తి అనిపించుకుంటాం, మంచి స్నేహితుడు అవుతాం. అయితే, దీనికి కొంత సాధన కావాలి.

**ఒకటి..** ముందుగా మీ మెదడులోని పాత సరుకునంతా తీసేయండి. బుర్రను ఖాళీ చేసుకోండి. మీ చేతిలోని కప్పు ఖాళీ అయితేనే కదా, కమ్మని తాజా చాయ్ నింపుకోడానికి వీలవుతుంది.

**రెండు..** ఏదైనా ఓ కొత్త చోటుకు వెళ్లినప్పుడు.. అప్పటికే అక్కడ ఉన్నవారిని గమనించండి. వాళ్ల మనసును చదవగలిగితే కొత్త సమాచారం లభిస్తుంది.

**మూడు..** ఎవరూ తమ మనసులోని మర్మాన్ని వెల్లడించరు. రెండు వాక్యాల మధ్య, రెండు పదాల మధ్య నక్కినక్కి దాకున్న ఆ సత్యాన్ని అర్థం చేసుకునే ప్రయత్నం చేయండి.

**నాలుగు..** ప్రతి ప్రయత్నం సఫలం కాదు. ప్రతి బేరీజూ నిజం కాలేదు. కొన్నిసార్లు పొరపాట్లు జరుగుతాయి. అయినా నిరాశపడకండి. నూన్–చీ కూడా సైకిలు నేర్చుకోవడం లాంటిదే. పడతాం. లేస్తాం. మళ్లీ పడతాం. మళ్లీ లేస్తాం. ఇంకెప్పుడూ పడం!

సృష్టిలో అత్యంత శక్తిమంతమైన జీవులే బతికి బట్టకట్టినట్టు దాఖలాలు లేవు. మార్పును గుర్తించే, మార్పును ఆమోదించే, మార్పును భాగం చేసుకునే నూన్–చీ ప్రాణులే యుగాలుగా, తరాలుగా మనుగడ సాగిస్తున్నాయి. వేగంగా తమ సంతతిని పెంచుకుంటున్నాయి. రాజ్యాలు ఏలేస్తున్నాయి. అది అడవి కావచ్చు, భూమి కావచ్చు, సముద్రమూ కావచ్చు. జై నూన్–చీ! ■

**స్టీవ్‌జాబ్స్‌లో ఓ గొప్ప నూన్–చీ నిపుణుడు ఉన్నాడని చెబుతారు పరిశీలకులు. ఎదుటి మనిషిని అంచనా వేయడంలో తను దిట్ట. ఆ వ్యక్తి బలాలను తూకమేసినట్టు గుర్తించగలడు. కాబట్టే, ప్రతి కస్టమర్ మనసులోకి తొంగి చూసినంత పక్కాగా ఆపిల్ ఉత్పత్తులను డిజైన్ చేయగలిగాడు. నూన్–చీ ఉత్తమ ఆంత్రప్రెన్యూర్ లక్షణం.**

### అప్పుడేం చేయాలి?

నూన్–చీ సున్నితమైన సమస్యలకు కూడా పరిష్కారం చూపుతుంది. ఓ మిత్రుడు ఆ మధ్యే విడాకులు తీసుకుంటాడు. ఆ సంగతి చాలా మందికి తెలియదు. ఎక్కడికి వెళ్లినా 'మీ ఆవిడను తీసుకురాలేక పోయారా?' అనే ప్రశ్నే. నూన్–చీలో నిపుణుడైన ఓ వ్యక్తి తనకు ఓ సలహా ఇచ్చాడు. 'ప్రతి బంధమూ కలకాలం నిలబడాలని లేదు. కొన్ని మొదట్లో, కొన్ని మధ్యలో, కొన్ని చివర్లో.. విచ్ఛిన్నం అవుతాయి. ఆ మాత్రం దానికి భయపడితే ఎలా? అయినా నీకు ఇబ్బందిగా అనిపిస్తే.. పూర్తి వ్యక్తిగత సంభాషణలకు ఆస్కారం ఉన్న కార్యక్రమాలకు రావద్దు. సాహితీ సమావేశాలు, సామూహిక ప్రార్థనలు, స్పోర్ట్స్ మీట్స్.. మొదలైన చోట్ల ఆయా అంశాల గురించి మాత్రమే చర్చ జరుగుతుంది. అక్కడికి వెళ్లు. నీకూ ఇబ్బంది ఉండదు' అని సలహా ఇచ్చాడు. గొప్ప పరిష్కారం కాకపోవచ్చేమో కానీ, ఎంతోకొంత చికాకును తప్పించే మార్గమిది. జీవితంలో ఆ పాటి లౌక్యం ఉండాలి.

